అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 237. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.08.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## జర్నలిస్టులందరికీ శిక్షణ ఇవ్వాలి

హైదరాబాద్.అమృత్ తెలంగాణ: తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా తరగతుల్లో జర్నలిస్టులందరికీ అవకాశం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఏదో ఒక సంఘానికి సంబంధించిన జర్నలిస్టులకు కాకుండా అన్నీ సంఘాల్లో సభ్యులుగాఉండే విలేకర్లకు శిక్షణ ఇవ్వాలని సూచించింది. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్యతోపాటు ఉపాధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఈ చంద్రశేఖర్, బి.జగదీష్ కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లో తమ సంఘంలో సభ్యత్వం తీసుకుంటేనే మీడియా అకాడమీ శిక్షణలో అవకాశమిస్తామని ఒక సంఘం చెప్పడాన్ని ఫెడరేషన్ నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.జర్నలిస్టులకు అందుబాటులో ఉండేలా శిక్షణ ప్రాంతాన్ని ఎంపిక చేయాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ రూపొందించి జర్నలిస్టుల స్కిల్ పెరిగేలా మీడియా అకాడమీ కృషి చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

## మహిళా ఎస్ఐపై దురుసు ప్రవర్తన

కల్లూరు :అమృత్ తెలంగాణ:విధి నిర్వహణలో ఉన్న కల్లూరు పోలీస్ స్టేషన్ మహిళా ఎస్ఐ హరితతో దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం తెలిపారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా తల్లాడ గ్రామానికి చెందిన రాయల రామారావుతోపాటు కొంతమంది యువకులు శుక్రవారం సాయంత్రం కల్లూరు పట్టణం ఎన్నెస్పీ క్రాస్ రోడ్డులోని చౌదరి హౌటల్ వద్దకు వచ్చి తమకు పరోట కావాలని అడిగారు.ఆ సమయంలోవారు మద్యం మత్తులో ఉన్నారు. ఇంకా తయారు కాలేదని, ఇంకో గంట సమయం పడుతుందని చెప్పడంతో హౌటల్ సిబ్బందిపై వారు దాడికి దిగారు. విషయాన్ని హౌటల్ యజమాని మాగంటి బోసుబాబు కల్లూరు పోలీస్‌లకు సమాచారం అందించారు.

కానిస్టేబుళ్లు వచ్చి గొడవ చేస్తున్నవారికి సర్దిచెప్పి పంపించారు. అనంతరం హౌటల్ యజమాని స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు.

# మంత్రివర్గ విస్తరణకు ఓకే..

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం ఆమోదం తెలిపింది. దీంతో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఫిక్స్ అయింది. ఆదివారం మధ్యాహ్నం 12.15 నిముషాలకు ముగ్గురు లేదా నలుగురికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుంది. అయితే దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం కానీ, గవర్నర్ కార్యాలయం కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఏదైనా కారణాలతో ఈరోజు మంత్రివర్గ ప్రమాణస్వీకారం జరగకుంటే బుధవారం రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని భావిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఆరు మంత్రిపదవులను భర్తీ చేయకపోవడంతో అసమ్మతి పెరిగిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు సీఎం ముహూర్తం ఖరారు చేసినట్టు సమాచారం. పోటీ ఎక్కువగా ఉన్న జిల్లాలను పక్కనపెట్టి తక్కువగా ఉన్న జిల్లాల నుంచి ముగ్గురు లేదా నలుగురిని మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. అందులో బీసీ, ఎస్సీ, రెడ్డి సామాజిక తరగతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అందులో కూడా ఏ జిల్లాకు ప్రాతినిధ్యం లేదో అక్కడి నుంచి మంత్రి పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది.

ప్రాతినిధ్యం లేని జిల్లాలకు ప్రాధాన్యత

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. అందులోనూ ఉమ్మడి మహబూబ్‌నగర్ లాంటి పెద్ద జిల్లా నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఖమ్మం నుంచి మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, నల్లగొండ జిల్లా నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కరీంనగర్ నుంచి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్కకు ప్రాతినిధ్యం లభించింది. అయితే సీఎంను మినహాయిస్తే మహబూబ్‌నగర్ నుంచి ఒకరే మంత్రి ఉండటంతో అక్కడి నుంచి బీసీ సామాజిక తరగతికి చెందిన వాకిటి శ్రీహరి ముదిరాజ్ పేరు బలంగా వినిపిస్తున్నది. ఆదిలాబాద్ నుంచి జీ వివేక్ వెంకటస్వామి, ప్రేమ్‌సాగర్‌రావు పేర్లు వినిపిస్తున్నా వివేక్ వైపే సీఎం మొగ్గు చూపే అవకాశం ఉందని సమాచారం. నిజామాబాద్ జిల్లా నుంచి పీ సుదర్శన్‌రెడ్డి ఖాయంగా కనిపిస్తున్నది. రంగారెడ్డి జిల్లాకు చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నట్టు సమాచారం. ఆయన ప్రతిపాదనకు సీఎం సానుకూలంగా ఉన్నా సామాజిక సమీకరణాలు అడ్డంగా ఉన్నాయి. దీనితో ఆయనకు మంత్రి పదవి వరించే అకాశం లేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. జనాభా ప్రాతిపదికగా మాదిగ సామాజిక తరగతికి మరో మంత్రి పదవి కావాలంటూ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్, వేముల వీరేశం, కాలే యాదయ్య తదితరులు అధిష్టానాన్నీ, సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నా, ఆ జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మంత్రులు అదే సామాజికతరగతికి చెందిన వారు ఉండటంతో ఆయనకు నిరాశ తప్పేలా లేదు. సీనియర్ నేత జానారెడ్డి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసినట్టు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ గెలిచినప్పటికీ




సామాజిక సమీకరణాల్లో ఆయనకు మంత్రి పదవి దక్కే అవకాశం లేదు. దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరినా, కేసు సుప్రీం కోర్టులో ఉంది. దీనితో ఆయన ఆశలపైనా నీళ్లు పోసినట్టేనని ప్రచారం జరుగుతుంది. గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం కల్పించి గ్రేటర్ హైదరాబాద్‌కు ఉపయోగించుకోవాలనేది ముఖ్యమంత్రి ఆలోచనగా ఉన్నట్టు సమాచారం. మంత్రివర్గంలో ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించాల్సి వస్తే ఎమ్మెల్యే బాలూ నాయక్, ఎస్టీ కార్పొరేషన్ చైర్మెన్ బెల్లయ్య నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే బెల్లయ్య నాయక్ ఎమ్మెల్సీగా లేకపోవడంతో, బాలూ నాయక్ ఉండే అవకాశం ఉంది. ఇటీవల ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అయిన విజయశాంతి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఆమె హెూంమంత్రి పదవి కావాలని కోరుతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

శాఖల మార్పులు


ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రుల శాఖలను మార్చాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. దానితోపాటే తన వద్ద ఉన్న కీలక శాఖలను వదులుకుని ఇతరులకు అప్పగించాలని యోచిస్తున్నారు. హెూం, విద్యాశాఖ, మున్సిపల్, జీఏడీ, క్రీడలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమం తదితర శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. వాటిలో కొన్ని శాఖలను కొత్త మంత్రులకు అప్పగిం చనున్నారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖలు కూడా మారతాయని ప్రచారం జరుగుతుంది.

మీనాక్షి నటరాజన్ ఢిల్లీ ప్రయాణం వాయిదా

మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తన ఢిల్లీ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. పార్లమెంటరీ నియోజకవర్గాల పార్టీ సమీక్షల్లో బిజీబిజీగా గడిపిన ఆమె తన దృష్టికి వచ్చిన సమస్యలను సీఎంకు వివరించారు. అందులో కీలకమైనది క్యాబినెట్ విస్తరణ. ఆలస్యం చేయడంతో అసమ్మతి పెరుగుతుందన్న విషయాన్ని ఆమె చెప్పినట్టు తెలిసింది. సీఎంతో మీనాక్షి నటరాజన్ భేటీ తర్వాత మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేసినట్టు సమాచారం

# కాంగ్రెస్‌ది ముమ్మాటికీ దుష్ప్రచారమే

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్ దుష్ప్రచారానికి పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. దాన్ని తిప్పికొడ తామని వ్యాఖ్యానించారు. పీసీ ఘోష్ కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతామని, కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లకు భయపడబో మని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్వాపరాలపై హరీశ్‌రావు శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ% మేడిగడ్డ బ్యారేజ్‌లో 86 పిల్లర్లలో రెండు పిల్లర్లకు పగుళ్ల వస్తే కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం కూలినట్టుగా కాంగ్రెస్ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎన్డీఎస్ఏ తన నివేదికలో పేర్కొన్నట్టు బ్యారాజ్‌కు మరమ్మతులు చేసి వినియోగంలో కి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ద్వారా మొత్తం 20,33,572 ఎకరాలకు సాగునీరం దిస్తే, ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదని అధికార పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల జీవధార అయిన కాళేశ్వరంపై నిజానిజాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తద్వా రా కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం అధికార పార్టీ నేతలు బట్టకాల్చి మీదేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే వారికి ముఖ్యమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పులపైనా, గోదావరిపై ఏపీలో బనకచర్ల ప్రాజెక్టు కట్టడం ద్వారా తెలంగాణకు జరిగే నష్టంపై నా కూడా త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. ఏపీ ప్రభుత్వం




గోదావరిపై బనకచర్ల వద్ద 150 టీఎంసీ సామర్థ్యంతో బొల్లాపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నదని గుర్తు చేశారు. దీనిపై తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు సైతం నోరు విప్పటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కింద ఒక్క ఎకరా పారలేదని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని హరీశ్ ఈ సందర్భంగా విమర్శించారు. 50 వేల ఎకరాలు మాత్రమే సాగయి ందంటూ మంత్రి ఉత్తమ్‌కుమార రెడ్డి చెప్తున్నారని గుర్తు చేశారు. ఇంకో కాంగ్రెస్ నాయకుడేమో లక్ష ఎకరాలే పారిందంటున్నారనీ, ఇలా ఎవరికి ఇష్టమొచ్చినట్టు వారు, ఒక్కో నాయకుడు ఒక్కో లెక్క చెప్తున్నారని ఎద్దేవా చేశారు. 2014 ముందు వరకు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనే ఉన్నదని, మరి అప్పుడు ఇంత పంట ఎందుకు పండలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం నీళ్లతో ఇప్పటి వరకు నేరుగా 98,570 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించామని తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కషి చేయలేదని అన్నారు. సీబీఐ, ఈడీ తరహాలో ఎన్డీఎస్ఏ కూడా ఇప్పుడు ఎన్డీఏ జేబు సంస్థగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం నిర్మాణంపై గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేయటంతోపాటు సీడబ్ల్యూసీ పలు సూచనలు చేసిన నేపథ్యంలో ప్రత్యామ్నాయా లను అన్వేషించాల్సి వచ్చిందని హరీశ్ చెప్పారు. ఈ క్రమంలో తన నేతృత్వంలో అప్పటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులు గా సీఎం కేసీఆర్ క్యాబినెట్ సబ్ కమిటీని నియమించారని గుర్తించారు. అదే విధంగా విశ్రాంత ఇంజినీర్లతో ఒక కమిటీని, ఇరిగేషన్‌శాఖ టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. అనంతరం ప్రాజెక్టును రీ డిజైన్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా నీటి లభ్యతకు పూర్తి భరోసాగా మేడిగడ్డ ఉన్నదంటూ టెక్నికల్ కమిటీ సూచించిందని వివరించారు. దీన్ని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ కూడా అంగీకరించిందని చెప్పారు. అయితే బొగ్గు గనులు, పట్టణాలు, అటవీ ప్రాంతం నేపథ్యంలో మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్‌మానేరుకు జలాలను తరలించలేమని రిటైర్డ్ ఇంజినీర్లు తెలిపారని వివరించారు. అందువల్ల గోదావరి ద్వారా జలాలను ఎల్లంపల్లి వరకు తరలించేందుకు నిర్ణయించామని అన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రిపోర్టులపై చర్చించి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాలంటూ సబ్‌కమిటీ ప్రభుత్వానికి నివేదికనిచ్చిందని తెలిపారు. దానిపై ఆనాడు సబ్ కమిటీ సభ్యులుగా ఉన్న ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సంతకం పెట్టారని హరీశ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలిలో బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డుప్లాట్లు, స్థలాలు వేలం

హైదరాబాద్ . అమృత్ తెలంగాణ: అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు, ఫ్లాట్లను బహిరంగ వేలం వేయాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ సంస్థలు నిర్ణయించాయి. దీనికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ వీపీ గౌతమ్‌లు ఇచ్చిన ప్రతిపాదనలను వనరుల సమీకరణలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈ నెల 20న దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని నిర్ణయించారు. రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పలు జిల్లాల్లోని 11 ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయిన, పాక్షికంగా పూర్తయిన అపార్ట్‌మెంట్లు, ఫ్లాట్లతో పాటు, ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం వేయాలని నిర్ణయించారు. వాటితోపాటు హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోని నాలుగు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలను కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తారు. ఎలాంటి వివాదాలు లేని భూములు, అందుబాటులో ఉండే ధరలతో నిర్మించిన అపార్ట్‌మెంట్లు–ఫ్లాట్లను కొనుగోలు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గృహనిర్మాణ సంస్థ కమిషనర్ వీపీ గౌతమ్ విజ్ఞప్తి చేశారు. ఈ విక్రయాలతో వచ్చిన ఆదాయంతో, ఓఆర్ఆర్ పరిసరాలు, ఇతర జిల్లాల్లో సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా హౌసింగ్ పథకాలను చేపట్టాలని భావిస్తున్నారు. రాజీవ్ స్వగృహకు సంబంధించి గాజుల రామారం, పోచారం, ఖమ్మం పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో (ఒక్కోదానిలో దాదాపు 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉన్న టవర్‌ను యూనిట్‌గా) ఏక మొత్తంగా విక్రయిస్తారు. బిల్డర్లు, ఒక గ్రూప్‌గా ఏర్పడి కొనుగోలు చేయాలనుకున్న వారితో పాటు, హౌసింగ్ కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు, బహుళ అంతస్తుల భవనాల అవసరం ఉన్న సంస్థలు కొనుగోలు చేసేందుకు వీలుకల్పిస్తారు.

రాజీవ్ స్వగృహ వేలం వివరాలు

రాజీవ్ స్వగృహకు చెందిన ఇండ్లను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తారు. రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 514, కుర్మల్‌గూడలో 20, చందానగర్‌లో 3 ఓపెన్ ఫ్లాట్లు, బండ్లగూడలో 159 పూర్తి అయిన ఫ్లాట్లు, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా గాజులరామారంలోని 5 టవర్లలోని పూర్తి కాని కట్టడాలు, పోచారంలో పూర్తి అయిన 601 ఫ్లాట్లు, అసంపూర్తిగా ఉన్న 6 టవర్లలోని వివిధ రకాల ఫ్లాట్లు,



బహదూర్‌పల్లిలోని 69 ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి.

మహబూబ్‌నగర్‌లో

మహబూబ్‌నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111 , అమిస్తపూర్‌లో 45 ఓపెన్‌ప్లాట్లను విక్రయించేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

ఖమ్మంలో

ఖమ్మం జిల్లా పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతో పాటు, 3.38 ఎకరాల ఖాళీ స్థలాన్ని కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తారు.

హౌసింగ్ బోర్డు స్థలాలు

కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ (కేపీహెచ్‌బీ)– 4వ ఫేజ్‌లో ఖాళీగా ఉన్న 7 ఎకరాల 33 గుంటల విస్తీర్ణంలోని ఖాళీ భూములు, అదే కాలనీలోని రెండు ఓపెన్ ప్లాట్లు (4,598 చదరపు గజాల విస్తీర్ణం, 2,420 చదరపు గజాల విస్తీర్ణం) ఈ–ఆక్షన్ ద్వారా విక్రయి స్తారు. నాంపల్లిలో 1,148 చదరపు అడుగుల విస్తీర్ణం లోని ఖాళీ స్థలం, సంజీవరెడ్డినగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీహాల్‌కు చెందిన 2,605 చదరపు గజాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంజీవరెడ్డినగర్‌లోని కమ్యూనిటీహాల్ (సెల్లార్, స్టిల్ట్, జీ ప్లస్1) 22,285 చదరపు అడుగుల విస్తీర్ణంలోని 37,070 చదరపు అడు గుల పార్కింగ్ స్థలంతో పూర్తి అయ్యే స్థితిలో ఉంది. ఈ భూములను ఫంక్షన్‌హాల్ నిర్వహణ కోసమే వేలం వేయనున్నారు.

# ఈటలది తప్పుడు వాంగ్మూలం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బీజేపీ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కాళేశ్వరం కమిషన్ ముందు తప్పుడు వాంగ్మూలం ఇచ్చారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈటెల వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఎవరిని రక్షించేందుకు ఆయన అబద్ధాలాడుతున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీకి, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేదని స్పష్టం చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన తర్వాత ప్రాణహిత, దేవాదుల, కాంతలపల్లి, తుపాకుల గూడెం పనుల కోసం సబ్ కమిటీ వేశారని మంత్రి తెలిపారు. కాళేశ్వరం నిర్మాణానికి సబ్ కమిటీ ఆమోదం తెలిపిందనడం అబద్ధమని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో తాను మంత్రిగా ఉన్న కాలంలో ప్రాజెక్ట్ అనుమతులకు సంబంధించి క్యాబినెట్ సబ్‌కమిటిలో గాని, క్యాబినెట్లో గాని ఆమోదం పొందలేదని తుమ్మల స్పష్టం చేశారు. 'కాళేశ్వరం ఎప్పుడూ క్యాబినెట్ ముందుకు రాలేదు. పరిపాలన అనుమతులతోనే నిర్మాణ పనులు చేపట్టారు. ఈటల రాజేందర్ కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఆయనకు అబద్ధాలు ఆడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది. తన పట్ల నాకు గౌరవం ఉంది. కానీ ప్రకటన చూసిన తర్వాత కొంత బాధేసింది. కమిషన్ వివాదంలోకి నన్ను ఎందుకు లాగాల్సి వచ్చిందో ఈటలే చెప్పాలి. తుమ్మల కూడ కాళేశ్వరం కోసం సబ్ కమిటీ




రిపోర్ట్‌పై సంతకం చేశారని ఇచ్చిన వాగ్మూలం బాధాకరం. కాళేశ్వరం క్యాబినెట్ ఉమ్మడి నిర్ణయమని చెప్పడం సరికాదు. హరీష్‌రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నా రు. వాస్తవాలు ప్రజలకు తెలియాలి. రాజకీయ లబ్దికోసం నీచ రాజకీయాలకు పాల్పడటం సరికాదు. ఇప్పటికైనా ఈటల ఆత్మ విమర్శ చేసుకుని తెలంగాణ సమాజానికి వాస్తవాలు చెప్పాలి" అని తుమ్మల డిమాండ్ చేశారు. కొంతమంది పెద్దలను తప్పించేందకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిరుపయోగమని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి బీఆర్ఎస్ సర్కార్ నిర్మాణానికి మొగ్గు చూపిందని ఆరోపించారు. మంత్రి మండలి సమావేశాల్లో పలు మార్లు అంతర్గతంగా తాను వాటితో విభేదించానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సర్కార్ ఏర్పాటు చేసిన సబ్ కమిటీ కాళేశ్వరంపై నివేదిక ఇవ్వలేదనీ, అన్ని ఆధారాలతో సుమోటోగా కమిషన్‌కు అందజేస్తానని తుమ్మల తెలిపారు.

# ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

కరీంనగర్ :అమృత్ తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, దేశంలో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్‌లను ప్రజలు ఖండించాలని సీపీఐ, సీపీఐ(ఎం) నేతలు డిమాండ్ చేశారు. మావోయిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి, బూటకపు ఎన్‌కౌంటర్‌లకు నిరసనగా శనివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మావోయిస్టులను హతమార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామంటూ డెడ్‌లైన్ విధించడం పాలకుల రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ఉగ్రవాదులు దేశంపై దాడి చేసి అమాయక ప్రజలను చంపితే.. పాకిస్థాన్‌తో చర్చలు జరిపిన కేంద్రం.. మన దేశంలో పేద ప్రజల కోసం, సమానత్వం కోసం, అసమానతల పట్ల పోరాటం చేస్తున్న మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరపాలని, లేకుంటే వామపక్షాల ఆధ్వర్యంలో రానున్న కాలంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు




గుడికందుల సత్యం, గీట్ల ముకుంద రెడ్డి, సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు కిన్నెర మల్లమ్మ, పైడిపల్లి రాజు, కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ఎడ్ల రమేష్, కోనేటి నాగమణి, మచ్చ రమేష్ బ్రాహ్మణపల్లి యుగంధర్, కొట్టే అంజలి, జి.తిరుపతి, గజ్జల శ్రీకాంత్, కాంపల్లి అరవింద్, సత్తయ్య, సిహెచ్.మురళి, నగునూరు రమేష్, గాజుల కనకరాజు, కో0పల్లి సాగర్, తిరుమలయ్య, పవన్ కండిరాజు, సందేశ్, అక్షరు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కుకేటీఆర్ పరామర్శ

శేరిలింగంపల్లి :అమృత్ తెలంగాణ: రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన ఎమ్మెల్యే గోపీనాథ్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు వినిపించాయి. 48 గంటలు ఆయనను అబ్జర్వ్‌లో పెట్టినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్ అమెరికా పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడికి వచ్చి రాగానే శనివారం ఉదయం



కేటీఆర్ ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఎమ్మెల్యే మాగంటిని పరామర్శించి, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే గోపీనాథ్ కోలుకోవాలని ఆకాంక్షించారు. మాగంటి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, రవీందర్‌రావు, నాయకులు మాలోతు కవిత, రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు.

# అంతర్నీ పాఠశాల భవనం కూలి నలుగురి పిల్లలకు తీవ్ర గాయాలు

**సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి విద్యార్థులు బలి......**
**వైద్యం పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన SJWHRC**
**ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి....**



వైద్యం పొందుతున్న విద్యార్థి సాయి కుమార్ ను పరామర్శిస్తున్న డాక్టర్ సఫా పండరి



కూలిన పాఠశాల భవనం

నిర్మల్ జిల్లా కుబీర్, జూన్ 7 అమృత్ తెలంగాణ కుబీర్ మండలంలోని అంతర్నీ,లో శుక్రవారం నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో విషాదం నెలకొంది బడిబాట కార్యక్రమం సందర్భంగా కుబీర్, మండలంలోని అంతర్నీ గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట ప్రారంభించి విద్యార్థులతొ ఒక ఫోటో దిగి, విద్యార్థులకు ఇవ్వాల్సిన పుస్తకాలను ఇవ్వకుండా పుస్తకాలను అక్కడే పెట్టేసి ఉపాధ్యాయులు వెళ్లిపోవడంతో, అక్కడే ఉన్న విద్యార్థులు శిథిలవస్థలో ఉన్న పాఠశాల భవనంవద్దనే విద్యార్థులు ఆడుకుంటుండగా భవనం స్లాబ్ ఒకే సారి కూలడంతో నలుగురు విద్యార్థులకు గాయాలు కావడంతొ బైంసా ఏరియా హాస్పిటల్కు తరలించి వైద్యం అందిస్తున్నారు కే సాయికుమార్ అనే విద్యార్థికి

ఎడమ కాలు మూడు చోట్ల విరిగి ఎముకలు బయటకు రావడం జరిగింది. సంఘటన జరిగిన 20 గంటలకు మండల విద్యాధికారి వచ్చి పరామర్శించి వెళ్లడం శోచనీయం ఇప్పటి వరకు ఎంతవరకు న్యాయమని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు వెంటనే సంఘటనపై విచారణ జరుపకపోవడం విచారకరం. పిల్లలందరూ పాఠశాలలో ఉండి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని పాఠశాలల ప్రారంభ దశలోనే ఇటువంటి సంఘటనలు ఎదురైతే విద్యార్థులను శిథిలవస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు తల్లిదండ్రులు ఏ విధంగా పంపుతా తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపించాలంటే భయపడతారని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి మాట్లాడుతూ



కాలు ఇరిగిపోయి వైద్యం పొందుతున్న సాయికుమార్

ఇట్టి విద్యార్థికి పూర్తిస్థాయిలో ఆరోగ్యం కుదుటపడే వరకు ప్రభుత్వం పట్టించుకోని, ఆర్థిక సహాయాన్ని అందించాలని తెలియజేశారు. అంతేకాకుండా DEO విద్యాధికారి జిల్లా స్థాయిలో, క్షేత్రస్థాయిలో గ్రామ గ్రామానికి వెళ్లి పాఠశాల భవనాలు ఏ విధంగా ఉన్నాయో గమనించి, విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, మరో మారు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అలికే దత్తాత్రి,అంతర్నీ ఐలేశ్వర్, తల్లిదండ్రులు సుజాత రాజేశ్వర్, పలువురు ఉన్నారు

# మేడిన్ చైనా' విడిభాగాల కోసం బారులు తీరుతున్నాం !




అమృత్ తెలంగాణ : మన ఆటోమొబైల్ పరిశ్రమ చైనా నుంచి రావాల్సిన ఒక చిన్న పరికరం కారణంగా ప్రస్తుతం ఆందోళన చెందుతోందంటే ఎవరైనా నమ్ముతారా? అదే నియోడిమియమ్ ఐరన్ బోరోన్ అనే మాగెట్. కార్లలో స్టీరింగ్ నుంచి బ్రేకులు, వైపర్లు, ఆడియో పరికరాల వంటి వాటికి ఇది ఎంతో ముఖ్యం. అది లేకపోతే మొత్తం కారు సిద్ధమైనా ప్రయోజనం ఉండదు. వాటి తయారీ, సరఫరాలో గుత్తాధిపత్యం ఉన్న చైనా ఏప్రిల్ నుంచి ఎగుమతుల మీద పలు ఆంక్షలు విధించింది. వాటిని దేనికి వినియోగిస్తారో ముందుగానే ఆయా దేశాలు హామీ పత్రాలు ఇవ్వాలన్నది వాటిలో ఒకటి. కొన్ని దేశాలు వాటిని కొని%ౕ% చైనాతో వైరానికి దిగిన అమెరికా, ఐరోపా దేశాలకు అమ్ముకుంటున్నాయి. దాన్ని నిరోధించేందుకే ఆ షరతు అన్నది స్పష్టం. మన దేశంలో గతంలో దిగుమతి చేసుకున్న నిల్వలు జూన్ మొదటి వారం వరకు వస్తాయని అందువలన త్వరగా తెచ్చుకొనేందుకు చైనాతో సంప్రదింపులు (పైరవీలు) జరపాలని ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ సొసైటీ, ఆటోమోటివ్ కాంపొనెంట్స్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు చైనా వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారని 'బిజినెస్ టుడే' పత్రిక (2025 మే 31) పేర్కొన్నది. 2024లో 470 టన్నుల మాగెట్‌లు దిగుమతి చేసుకోగా ఈ ఏడాది 700 టన్నులకు నిర్ణయించారు. చైనా మీద ఆధారపడకుండా మనమే మాగెట్‌లు తయారు చేసేందుకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలో నిర్ణయించేందుకు జూన్ 3న ఉన్నత స్థాయి కమిటీ సమావేశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు కూడా ఆ పత్రిక రాసింది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం అంటే ఇదే! పదకొండు సంవత్సరాల నుంచి ఏం చేసినట్లు?

'లోకల్ సర్కిల్స్' సంస్థ 2025 ఏప్రిల్ 25వ తేదీన తన సర్వే నివేదికను ప్రచురించింది. అందులో చెప్పిన ప్రకారం గడచిన ఏడాది కాలంలో భారతీయుల్లో 62 శాతం మంది చైనా వస్తువులను కొనుగోలు చేశారు. అంతకు ముందు ఏడాది వారు 55 శాతమే ఉన్నారు. 15 శాతం మంది చైనా నుంచి కొత్త వస్తువులు భారతీయ కంపెనీల ద్వారా వస్తే కొనుగోలు చేయటం ఖాయమని చెప్పారు. ఈ వివరాలు సూచిస్తున్నదేమిటి? స్వదేశీ వస్తువులనే వాడండి అని పాలకులు ఎన్ని సుభాషితాలు పలికినప్పటికీ జనం పట్టించుకోవటం లేదు. మా వెనుకే జనం ఉన్నారని చెప్పుకుంటున్న పార్టీ మాటలు విని ఉంటే చైనా దిగుమతులు పడిపోయేవి. దానికి విరుద్ధంగా మోడీ ఏలుబడిలో రికార్డులు బద్దలవుతున్నాయి.

రాజకీయంగా అమెరికాతో అంటకాగేందుకు కేంద్ర పాలకులు తపించి పోతుంటారు. కాషాయ దళాలు నిత్యం చైనా, కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొడుతుంటాయి. కానీ ఆర్థిక విషయాల్లో మాత్రం చైనా కావాల్సి వస్తోంది. నరేంద్ర మోడీ అధికారం స్వీకరించగానే 2014లో చెప్పిందేమిటి? మేకిన్ ఇండియా పథకంతో దేశాన్ని ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా మారుస్తా, అందుకు అవసరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. ఉత్పత్తితో ముడిపెట్టిన ప్రోత్సాహక పథకం (పిఎల్ఐ) ప్రకటించారు. జిడిపిలో ఉత్పాదక రంగ వాటాను 15 నుంచి 2025 నాటికి 25 శాతానికి పెంచుతానని, కీలక రంగాల్లో చైనా మీద ఆధారపడటాన్ని తగ్గిస్తా అని చెప్పారు. అందుకు దేశమంతటా గుజరాత్ నమూనా అభివృద్ధి చేస్తా అన్నారు. పదేళ్లలో జరిగిందేమిటి? కొంత మేరకు ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతుల విలువ పెరిగింది. జిడిపిలో వస్తూత్పత్తి వాటా పెరగకపోగా 14 శాతానికి తగ్గింది. దీని గురించి మాట్లాడకుండా సెల్ ఫోన్ల ఎగుమతి చూడండి, యాపిల్ కంపెనీ 20 శాతం ఉత్పత్తి ఇక్కడే చేస్తున్నది అంటూ సర్వస్వం అదే అన్నట్లుగా చిత్రిస్తున్నారు. పిఎల్ఐ స్కీములో కేటాయించిన 1.9 లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ దీనికి ఒక కారణం. టెలికమ్యూనికేషన్స్, పివి సెల్స్ వంటి కొన్ని దిగుమతులు చైనా నుంచి తగ్గాయి. కానీ ఔషధ రంగానికి అవసరమైన ఏపిఐ దిగుమతులు 75 నుంచి 72 శాతానికి మాత్రమే తగ్గాయి. అనేక రంగాలకు ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను సాధించటంలో వైఫల్యం కనిపిస్తుంది. మొత్తంగా విజయమా, వైఫల్యమా అన్నది చూడాలి. యాపిల్ కంపెనీని ఒక ఉదాహరణగా చూపుతున్నారు. చైనాలో ఉత్పాదక ఖర్చు పెరిగిన కారణంగా అది వియత్నాం, మన దేశానికి వచ్చింది. అమెరికాలో తడిచి మోపెడవుతుంది గనుక ఎన్ని పన్నులు వేసినా విదేశాల్లోనే తయారు చేస్తానని ట్రంప్‌కు తెగేసి చెప్పింది. సీ జిన్‌పింగా, నరేంద్ర మోడీనా, ట్రంపా, ఎల్లయ్యా, పుల్లయ్యా అన్నది కాదు. దానికి కావాల్సింది లాభాలు. రేపు ఆఫ్రికా ఖండంలో ఖర్చు తక్కువగా ఉంటే పోలోమంటూ అక్కడికి పోతుంది. ఆ కంపెనీ చైనాలో విశ్వవిద్యాల యాలు, పరిశోధనా సంస్థలు, విడిభాగాలు తయారు చేసే పరిశ్రమలతో సమగ్ర ఒప్పందాలు చేసుకుంది. మన దేశంలో అలాంటివేమీ లేదు. వాజ్‌పేయి పాలనలో దేశం వెలిగిపోయిందని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ పాలన ముగిసి యుపిఏ అధికారానికి వచ్చిన రెండేళ్లకు 2006లో నేషనల్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంపిటీటివ్ కౌన్సిల్ ఉత్పాదక రంగం సంక్షోభంలో ఉందని, జాతీయ ఉత్పాదక విధానాన్ని రూపొందించాలని కోరింది. దానికి అనుగుణంగా 2011లో యుపిఏ సర్కార్ పదేళ్లలో జిడిపిలో ఉత్పాదక రంగ వాటాను పెంచేందుకు ఒక విధానాన్ని ఆమోదించింది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన తరువాత 2014లో దానికి మేకిన్ ఇండియా అనే పేరు తగిలించి తానే రూపొందించినట్లు ప్రచారం చేసుకున్నారు. దాన్లో భాగంగానే సబ్సిడీలకు ప్రోత్సాహకాల పేరుతో కొత్త పేరు పెట్టి 2020లో పిఎల్ఐ స్కీమును ఐదేళ్ల ప్రణాళికతో ప్రకటించారు. దాని గడువు ముగిసినప్పటికీ లక్ష్యాలను సాధించకపోవటంతో పొడిగించాలని నిర్ణయించారు. చిత్రం ఏమిటంటే గాల్వన్ లోయ ఉదంతాల తరువాత దేశభద్రతకు ముప్పు అనే పేరుతో పరోక్షంగా చైనా పెట్టుబడులను నిషేధించిన మోడీ సర్కార్ ఈ స్కీము కింద ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో చైనా కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టి సబ్సిడీలు పొందవచ్చని నిర్ణయించింది. అయితే దానికి మన దేశంలో ఉన్న ఏదైనా కంపెనీతో సంయుక్త భాగస్వామ్యంలో 49 శాతం వాటాకు పరిమితం కావాలని, యాజమాన్యం భారతీయ కంపెనీల చేతుల్లో ఉండాలని, సాంకేతిక పరిజ్ఞాన బదిలీలు జరగాలని షరతు పెట్టింది (ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ 2025 ఏప్రిల్ 28). వేగంగా పని చేస్తానని చెప్పుకొనే మోడీ సర్కార్‌కు ఈ నిర్ణయం తీసుకొనేందుకు పదేళ్లు పట్టింది, చివరకు పెట్టుబడిదారుల ఒత్తిడి పని చేసినట్లు కనిపించి, ఏదైతే అదవుతుందని సందిగ్ధావస్థ నుంచి బయటపడినట్లు ఉంది.

పోనీ ఈ పదేళ్లలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులేమైనా కేటాయించిందా? గత మూడు పారిశ్రామిక విప్లవాల బస్సులను ఎక్కలేకపోయామని నరేంద్ర మోడీ చెప్పింది నిజమే, కానీ నాలుగో బస్సును ఎక్కటానికి చేసిందేమిటి అన్నది ప్రశ్న. జిడిపిలో అమెరికా 2.8, చైనా 2.1, దక్షిణ కొరియా 4.2, ఇజ్రాయిల్ 4.3 శాతం ఖర్చు చేస్తుంటే మన ఖర్చు పదేళ్లలో 0.6 నుంచి 0.7 శాతం మధ్య ఉందంటే మోడీ దేశాన్ని ఎంత వెనక్కు తీసుకుపోయారో అర్ధం అవుతోంది. ఎంతసేపూ ఆవు పేడలో, మూత్రంలో బంగారం ఉందా, ఏముంది అనే ఆత్రంతో పరిశోధనల మీద ఉన్న కేంద్రీకరణ మిగతా వాటి మీద లేదు. ఇందువల్లనే మనదంటూ చెప్పుకొనేందుకు హిందూత్వ తప్ప ఒక్క వస్తువు బ్రాండైనా లేదు. చైనా నుంచి కంపెనీలు వస్తున్నాయదిగో చూడండి, ఇదిగో చూడండి, అంటూ ఇంట్లోకి గేటు బయటకు తిరిగి చూసినట్లు తప్పస్వంత కంపెనీల ఏర్పాటు గురించి పట్టించుకోలేదు. రిలయన్స్, ఇతరులకు చమురు తవ్వకం ఇచ్చారు. పదేళ్ల నాటికీ ఇప్పటికీ స్వంత ఉత్పత్తి తగ్గింది తప్ప పెరగలేదు.

పదకొండేళ్ల మోడినోమిక్స్ తీరుతెన్నులు చూసినపుడు కొన్ని ధోరణులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎండమావుల వెంట నీళ్ల కోసం పరుగెత్తినట్లుగా ఆధునిక టెక్నాలజీ కోసం మన దేశం అమెరికా వైపు చూస్తోంది. ఇంధనం, ఆయుధాల కోసం రష్యా మీద, చౌకగా వచ్చే వస్తువుల కోసం చైనా మీద ఆధారపడినట్లు కనిపిస్తోంది. ఇలా ఎంతకాలం అన్నది ప్రశ్న. చైనా వస్తువుల మీద ఆధారపడిన అమెరికా, ఇతర ఐరోపా దేశాలు నేర్చుకున్న గుణపాఠం మనవారు నేర్చుకోవటానికి సిద్ధంగా లేరు. అందుకు నిదర్శనం పరిశోధన–అభివృద్ధి కేటాయింపులను నిర్లక్ష్యం చేయటమే. మనదంటూ ఒక ప్రత్యేకత లేకపోతే సమగ్ర స్వయం సమృద్ధి అనేది పగటి కలే!



అమృత్ తెలంగాణ బ్యూరో సీనియర్ రిపోర్టర్ కేవీఎల్ రాములు

# త్యాగానికి ప్రతీక బక్రీద్ : ఆడే గజేందర్



మైనార్టీలతో ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి నేరడిగొండ పట్టణ ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ భక్తికి, త్యాగానికి, సహనానికి బక్రీద్ పండుగ ప్రతీక అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపు కోవాలన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే బక్రీద్ ఇచ్చే సందేశమన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు ఆయనతో పాటు బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



బక్రీద్ పండగ మైనారిటీలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆడే గజేందర్

# బాధిత కుటుంబనీ పరామర్శించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: బోథ్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియరు నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి మరణించడం తో వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజెందర్ ఆయన తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి,%జుఖఎం% డైరక్టర్ గొర్ల రాజ్ యాదవ్ , ఉమేష్ ,మాజీ సర్పంచ్ దాస్, మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బద్దం పోత రెడ్డి,నాయకులు బోజనా, లింగారెడ్డి, గంగాధర్, కృష్ణ రెడ్డి,వాసు రెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నర్



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆడే గజేందర్

# మన ఊరి విద్యార్థులను బడిలో చేర్పిద్దాం..

పెద్దవూర :అమృత్ తెలంగాణ: మనవూరి పిల్లలను మన ఊరి ప్రభుత్వ బడిలోనే చేర్పిద్దాం అనే నినాదంతో మండలంలోని వెల్మ గూడెంలో ఎంఈఓ తరి రాము, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మన్నెం వెంకిటేశ్వరు శనివారం ఇంటింటికి వెళ్లి ప్రొఫెసర్ జయశంకర్ బడి బాటలో భాగంగా ఈడు పిల్లలు ఎంతమందిఉన్నారు.ప్రయివేట్ పాఠశాలలకు ఎంతమంది వెళ్తున్నారు అనే వివరాలను సేకరించి ప్రయివేట్ స్కూల్‌కి వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మన్నెం వెంకటేశ్వర్లు,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు బాషిపాక లక్ష్మీ సురేందర్, పాఠశాల ఉపాధ్యాయులు ఉప్పునూతల వెంకయ్య,నామిరెడ్డి ప్రశాంతి,ఎండిరహీం గ్రామస్తులు తదితరులు పాల్గొని రెండవ రోజు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నంబర్కు సంప్రదించాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

సైబర్ నేరానికి గురైన వెంటనే 1930 నంబర్కు సంప్రదించాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్
సైబర్ నేరాలకు ప్రజలకు అప్రమత్తత ప్రధాన అస్త్రం.
సైబర్ బారిన పడిన గంటలోపు సంప్రదిస్తే డబ్బులు తిరిగి వచ్చే అవకాశం ఎక్కువ.
గతవారం జిల్లాలో దాదాపు 15 ఫిర్యాదులు నమోదు.
ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, క్రెడిట్ కార్డ్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ఫ్రాడ్ ప్రస్తుతం చలామణిలో ఉన్నవి.
జిల్లా సైబర్ బృందం చే ప్రతిరోజు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు.
భవిష్యత్తు సైబర్ నేరాల తో మాత్రమే ఉంటుందని, ప్రజలు జాగ్రత్తలు వహించాలని సూచన.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : రానున్న భవిష్యత్తు ప్రపంచంలో సైబర్ నేరాలకు గురై ప్రజలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతిరోజు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన ఖచ్చితంగ కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ, సైబర్ నేరాలకు ప్రజలు గురైన వెంటనే 1930 నెంబర్ కి సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలకు బారిన పడిన గంటలోపు ఫిర్యాదు చేసిన ఎడల ఆర్థిక నష్టం జరిగిన వాటిని తిరిగి రప్పించే అవకాశం ఎక్కువగా ఉన్నందున గోల్డెన్ హావర్ లో ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యమైనదని తెలిపారు. సమాజంలో ప్రజలకు జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రస్తుత సమాజంలో జరిగే ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, లోన్ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, సోషల్ మీడియా ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, లాటరీ ఫ్రాడ్, క్రెడిట్ కార్డు ఫ్రాడ్ లాంటివి ఎక్కువగా జరుగుతున్నదని ప్రజలకు వాటిపై పూర్తి అవగాహన కల్పించి, ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండడం ఉత్తమ మార్గమని తెలియజేశారు. వాట్సాప్ గ్రూపుల నందు ఎలాంటి ఏపీకే ఫైల్స్ లను డౌన్లోడ్ చేసుకోకుండా ఉండాలని, వాటి ద్వారా మొబైల్ ఫోను సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళుతుందని ఇలాంటి వాటికి గురైనప్పుడు వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని తెలిపారు. ముఖ్యంగా ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్ లలో ప్రజలు అత్యాశతో డబ్బులను వారికి విడతల వారీగా అందజేస్తూ చివరికి మోసపోయామనే విషయాన్ని గ్రహిస్తున్నారని తెలిపారు. అనవసరంగా ఇతరుల వ్యక్తులకు క్రెడిట్ కార్డు ఓటిపి నంబర్లను తెలియజేయడం వల్ల డబ్బు నష్టపోతున్నారనే విషయాన్ని తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా నందు గత వారం రోజులుగా నమోదైన పలు కేసుల వివరాలు.

ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి గత రెండు నెలలుగా జైనం బ్రోకింగ్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ లో పెట్టుబడి పెట్టడం ప్రారంభించారు. ఈ గ్రూప్లో సభ్యులు మొదట స్టాక్ ట్రేడింగ్పై దృష్టి సారిస్తారు. అయితే, స్టాక్ మార్కెటింగ్లో పెట్టుబడి పెట్టి సుమారు 28 లక్షల రూపాయలు నష్టపోయాను. ఈ విషయాన్ని పరిశీలించి, WhatsApp·Ö|t %Candlestick Forecast 262" లో ఉన్న సభ్యులు నన్ను మోసగించారని నేను గుర్తించి, సైబర్ కార్యాలయాన్ని సంప్రదించడం జరిగింది.

ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ని ఒక వ్యక్తి ఒక నకిలీ అక్రమ వెబ్సైట్లోని బెట్టింగ్ కార్యకలాపాల్లో పాల్గొనమని డబ్బులు ఎక్కువగా సంపాదించవచ్చు అని తప్పుదారి పట్టించిన సైబర్ నేరగాళ్లు. వారు మ్యాచ్ ఫలితాల ముందస్తు అంచనాలు ఇచ్చి, ఖచ్చితమైన లాభాలు వస్తాయని హామీ ఇచ్చారు. అయితే, చెల్లింపు చేసిన తర్వాత తనకు ఎటువంటి సహాయం గానీ, గెలుపు మొత్తం గానీ అందలేదు. అప్పుడే ఇది ఒక మోసం వెబ్సైట్ అని అతనికి తెలియ వచ్చింది. ఈ మోసం నందు అతను పదివేల రూపాయలను పోగొట్టుకోవడం జరిగింది.

ఉట్నూరు మండలంలోని చేతన్ కుమార్ అనే వ్యక్తికి WhatsAppలో ఒక మెసేజ్ వచ్చింది. మెసేజ్ పంపిన వ్యక్తి పేరు మిస్సు పల్లవి ఝా, ఆమె తనను ప్రైవేట్ కంపెనీలో రిసెప్షనిస్ట్ ఇన్ఛార్జ్ అని పరిచయం చేసుకుంది.

ఆమె చెప్పినది ఏమిటంటే, "మీరు ఇంటి నుంచే చేసుకోగలిగే పార్ట్ టైం జాబ్ ఇస్తున్నాం, వర్కింగ్ అవర్స్ ఫ్లెక్సిబుల్ గా ఉంటాయి. జాబ్ మరియు జీతం వివరాలు చెప్పనా?" అని అడిగింది. ఆ తరువాత ఆమె వివరించింది – "జాబ్ ఏంటంటే, గూగుల్ మ్యాప్స్ లో హోటల్స్ కి 5 స్టార్ రివ్యూలు ఇవ్వాలి. మీరు రోజుకి పూర్తిచేసే టాస్కులపై ఆధారపడి రోజుకి 2000 నుంచి ?8000 వరకు జీతం ఉంటుంది. మీరు ఒక్క టాస్క్ పూర్తి చేస్తే వెంటనే జీతం వస్తుంది, ఆపై తరువాత టాస్క్ ఇస్తాం" అని చెప్పింది.

విత్డ్రా కోసం సీనియర్ రిసెప్షనిస్ట్ చందా ని సంప్రదించమంది. నా డబ్బు తిరిగి ఇచ్చింది. అప్పుడే నాకు ఇది నమ్మకంగా అనిపించింది. తర్వాత ఆమె మరో ప్రీపెయిడ్ టాస్క్ ఇచ్చింది. నేను ముందుగా తిరస్కరించినా, ఆమె తిరిగి తిరిగి అడుగుతూ మెంటల్గా ఒత్తిడి చేసింది. చివరికి నాకు మైండ్ వాష్ అయిపోయి, "ఇంకా డబ్బు వస్తుందేమో" అనే ఆశతో అంగీకరించాను. అప్పుడు ఆమె నాకు మరో టీచర్ ఐడీ పంపింది – పేరు అండ్రే కోవల్స్కి

మొదటి ఆర్డర్కు నేను ?9700 చెల్లించాను. ఆ తరువాత అతను మరో టాస్క్ ఇచ్చాడు, అది ?38,000. రెండు ప్రీపెయిడ్ టాస్కులు చేసిన తరువాత "ఇవి సరిపోతాయి" అని అనుకున్నాను. కానీ అతను మళ్లీ మరో టాస్క్ ఇచ్చాడు అది 77,000.

ఆ డబ్బు చెల్లించకపోతే "మీ డబ్బంతా పోతుంది" అని బెదిరించాడు. నాకు భయంగా అనిపించి, నా స్నేహితుని సహాయం తీసుకుని ?77,000 రుణంగా తీసుకుని అతనికి పంపించాను. కానీ ఆ తరువాత కూడా మళ్లీ ఇంకొక టాస్క్ ఇచ్చాడు.

ఇలా టాస్క్ మీద టాస్కులు ఇచ్చి నప్పుడు ఆయన మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులకు సంప్రదించాడు. ఇలా విడతలవారీగా ఆయన ఒక లక్ష 30 వేల రూపాయలను పోగొట్టుకోవడం జరిగింది.

ఇచ్చోడ మండలంలోని ఒక వ్యక్తికి టెలిగ్రామ్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్ను వాట్సాప్లోకి మారుస్తూ, "మీరు పెట్టుబడి పెడితే మీకు డబ్బు డబుల్ చేస్తాం" అని చెప్పారు. వారు నాకు "ఎంత పెట్టుబడి చేయాలనుకుంటున్నారు?" అని అడిగారు. బాధితుడు ?20,000 పెట్టుబడి చేస్తానని చెప్పాడు.

తరువాత వారు చెప్పారు, "మీకు ?1,39,900 లాభంగా వచ్చింది, కానీ మీరు దానిని విత్డ్రా చేసుకోవాలంటే ముందుగా 25 శాతం చెల్లించాలి" అన్నారు. ఆ కిందా బాధితుడు ?34,975 చెల్లించాడు.

ఆ తరువాత, "మీకు ఖాతా క్రియేట్ చేయాలంటే ?39,999 మరోసారి చెల్లించాలి" అని చెప్పారు.

నా దగ్గర డబ్బు లేకపోవడం వల్ల నేను పంపలేకపోయాను. దాంతో, వారు నా ఖాతాను బ్లాక్ చేసి, వాట్సాప్ చాటింగ్ను కూడా క్లోజ్ చేశారు. టెలిగ్రామ్ కూడా డిలీట్ చేశారు. అని ఫిర్యాదు చేయగా, బాధితుడు మొత్తం చెల్లించిన మొత్తం ?54,975. మోసపోవడం జరిగింది.

ఆన్లైన్ మోసాలు – వ్యాపార మరియు పెట్టుబడి మోసాలు – ఇతర రకాలు

బాధితుడికి గుర్తు తెలియని టెలిగ్రామ్ ఐడీ నుండి ఒక మెసేజ్ వచ్చింది, అందులో క్రిప్టోకరెన్సీ/బిట్కాయిన్లో పెట్టుబడి పెట్టమని సూచిస్తూ ఒక లింక్ ఇవ్వబడింది. ఆ లింక్ ద్వారా బాధితుడు నమోదు అయ్యాడు. అనంతరం టెలిగ్రామ్లో పెట్టుబడి ఎలా చేయాలో వారికి గైడ్ చేశారు మరియు బాధితుడు డబ్బును పెట్టుబడి చేశాడు. తరువాత పెద్ద మొత్తం పెట్టుబడి చేసిన తర్వాత, బాధితుడు ఆ డబ్బును విత్డ్రా చేసుకోలేని పరిస్థితి ఎదురైంది. అప్పుడు అతనికి ఇది ఒక మోసం అని తెలిసి, 1930 నంబర్ను సంప్రదించాడు.

# దేశహితం కోసం ప్రధాని మోదీ ఎన్నో మార్పులు తెచ్చారు : ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

దేశహితం కోసం ప్రధాని నరేంద్ర మోదీ తన 11సంవత్సరాల పాలన లో ఎన్నో మార్పులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే అన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ జిల్లా భైంసా జూన్ 7 అమృత్ తెలంగాణ శనివారం భైంసా పట్టణం లోని ఎస్. ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో మోదీ 11 సంవత్సరాల పాలన పై ఏర్పాటు చేసిన సమావేశం లో అయన మాట్లాడారు. నోట్ల రద్దు చారిత్రాత్మక నిర్ణయం అని, ఈ నిర్ణయం తో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ ను చిన్నభిన్నాం చేసిన ఘనత మోదీ దే నన్నారు. ఆపరేషన్ సింధూర్ తో శత్రు దేశాన్ని గజ గజ లాడించమన్నారు. ఒకే చట్టం ఒకే దేశం నినాదం తో 370 ఆర్టికల్ ను రద్దు చేయడం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అయ్యాయన్నారు. కేంద్రం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లో తీసుకెళ్లాలని అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం గా ముందుకు సాగాలన్నారు. అనంతరం 11సంవత్సరాల పాలన ప్రోగ్రాం కన్వీనర్ గా ఎన్నికైనా ముల్లవార్ అనిల్, కో కన్వీనర్ బండారి దిలీప్ ను శాలువ తో సత్కరించారు. కార్యక్రమం లో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణ అధ్యక్షులు రావుల రాము, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుపోతుల మల్లేష్,నాయకులు గాలి రవి,తుమ్మెల్ల దత్తాత్రి తదితరులు ఉన్నారు.

# వర్షాకాల సమయంలో రైతులు తమ చేనులకు వెళ్లడానికి సరైన రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ప్రస్తావించడంతో ప్రభుత్వం స్పందించి పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్



భూమి పూజ చేస్తున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : వర్షాకాల సమయంలో రైతులు తమ చేనులకు వెళ్లడానికి సరైన రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల ప్రస్తావించడంతో ప్రభుత్వం స్పందించి పొలం బాట కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇందులో భాగంగా శనివారం జైనథ్ గ్రామం నుండి చేనులకు పోవడానికి 28 లక్షల నిధులతో సుమారు 5 కిలోమీటర్ల రహదారి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. విడతలవారీగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రైతులు వర్షాకాలం సైతం చేనులకు వెళ్లే విధంగా రోడ్డు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఇప్పటికే ఒక ప్రణాళిక రూపొందించామని అన్నారు. చేనులకు రోడ్లు వేసే సమయంలో ఇరుకుగా ఉన్న మార్గం ఉన్న చోట రైతులు సైతం స్థలం ఇవ్వడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు .మండల అధ్యక్షులు కర్ణాకర్ రెడ్డి నాయకులు అశోక్ రెడ్డి. రాకేష్ రెడ్డి రమేష్ రెడ్డి. ప్రతాప్ యాదవ్ లక్ష్మన్న అశోక్ లింగారెడ్డి గంగాధర్ సన్నీ విశాల్ తదితరులు పాల్గొన్నారు

# నిర్మల్ జిల్లా వ్యాప్తంగా బక్రీద్ సందర్భంగా పటిష్ట బందోబస్తు



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి: ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శాంతి భద్రతలను దగ్గరుండి మరి పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల ఐపిఎస్ ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా ముగిసిన ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు ఈరోజు బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ జి జానకి షర్మిల ఐపిఎస్ గారు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శాంతి భద్రతలను దగ్గరుండి పర్యవేక్షించారు ముఖ్యంగా భైంసా పట్టణం లోని ఈద్గా లను మసీదు లను సందర్శించి శాంతి భద్రతల విషయం లో ఏ మాత్రము లోటు పాట్లు లేకుండా చూసుకున్నారు చిన్నారులను,మత పెద్దలను కలిసి పండగ శుభాకాంక్షలు తెలియ జేశారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అంతటా ప్రశాంతంగా ఉండే విధంగా చూసుకున్నారు.ట్రాఫిక్ మరియు పలు అంశాల గురించి పోలీస్ అధికారులకు క్షుణ్ణంగా ఎస్పీ గారు వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పి రాజేశ్ మీన ఐపిఎస్,భైంసా ఏఎస్పి అవినాష్ కుమార్ ఐపిఎస్,ఇన్స్పెక్టర్ లు ప్రవీణ్ కుమార్,క్రిష్ణ, గోవర్ధన్,గోపీనాథ్,డి.ఎస్.బి ఇన్స్పెక్టర్ సమ్మయ్య, ఆర్ ఐ.రామ్ నిరంజన్,ఎస్.ఐ లు,ఆర్.ఎస్.ఐ లు,డాగ్ స్క్వాడ్ బృందం ఇతర పోలీసు సిబ్బంది ఉన్నారు.

# నిర్మల్ గ్రామీణ మండలంలోని మంజులాపూర్ లో తప్పిపోయిన ఐదేళ్ల చిన్నారి

త్వరితగతిన వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులకు అప్ప జెప్పిన రూరల్ పోలీసు సిబ్బంది



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంజులాపూర్ గ్రామంలో ఐదు సంవత్సరాల గుళ్ళే తనుశ్రీ అనే చిన్నారి తప్పిపోయి రోడ్డుపై ఉండగా,వెంటనే స్పందించిన నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆ చిన్నారి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించడం జరిగింది. ఇట్టి విషయంలో మానవతా దృక్పథంతో త్వరితగతిన స్పందించిన నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి, ఏఎస్ఐ బాబారావు, మహిళా కానిస్టేబుల్స్ లక్ష్మి,పరిమళ ను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్. ప్రశంసించారు

# జాతీయ మెరిట్ స్కాలర్ షిప్ కు ఎంపికైన విద్యార్థి



పెద్దవూర :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దవూర విద్యార్థి రోహిత్ ఎనిమిదో తరగతి విద్యార్థి ఎంఎంఎంఎస్ పరీక్షలు ఉత్తీర్ణుడై సెలెక్ట్ కావడం జరిగినది. నేషనల్ మెరిట్ స్కాలర్షిప్ కు ఎన్నికైనందున విద్యార్థిని అభినందనలు తెలియజేస్తూ కష్టపడి పనిచేసిన ఉపాధ్యాయులను అభినందనలు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ఇంకా ఎక్కువ మంది మెరిట్స్ స్కాలర్షిప్స్ సాధించడానికి కృషి చేస్తామని తెలియజేస్తున్నాము. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖాదికారి తరి రాము తెలిపారు

# విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పెద్దవూర : అమృత్ తెలంగాణ: విద్యుత్ ఘాతంతో కోడెద్దు మృతి చెందిన సంఘటన పెద్దవూర మండలం బట్టుగూడెం గ్రామం లో చోటు చేసుకుంది. గ్రామస్తులు బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం బట్టుగూడెం గ్రామానికి చెందిన చెన్ను సైదిరెడ్డి ఆవులు మేత మేయడానికి పొలానికి వెళ్లగా అందులోని ఒక కోడె కంచె లేని ట్రాన్స్ఫార్మర్ దగ్గరలో మేస్తుండగా విద్యుత్ వైరు కోడెకు తగలడంతో విద్యుత్ ఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. ఎద్దు మృతిని తెలుసుకున్న బాధితుడు,కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించాడు. మృతి చెందిన ఎద్దు విలువ 80,000 రూపాయలు విలువ వుంటుందని తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు. కాగా, కంచె లేని ట్రాన్ఫార్మర్ వద్ద బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు

# ఘనంగా ప్రభుత్వ విప్ జన్మదిన వేడుకలు



బొమ్మలరామారం :అమృత్ తెలంగాణ: మండలంలోని సోలిపేట గ్రామంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలను గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్ల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు రాజేశ్వర్ యాదవ్, మాజీ సర్పంచ్ రెడ్డి నాయక్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులు గౌడ్, బాబు, ధీరావత్ స్వామి నాయక్, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చండూర్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు..



చండూరు :అమృత్ తెలంగాణ: చండూరు మున్సిపల్ పట్టణంలో శనివారం బక్రీదు పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం మత గురువు ముజాహిద్ మాట్లాడుతూ.. విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ పండుగ అని, ఈ పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ త్యాగ నిరతికి, ధర్మ నిబద్ధతకి ప్రతీక ,అని ఆయన పేర్కొన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో బక్రీద్ పండుగ జరుపుకున్నారు.

# అసైన్డ్ భూములే టార్గెట్




మెదక్ : అమృత్ తెలంగాణ: పంటలు పండించేది.. పరిశ్రమలు స్థాపించేది ఇలా ఏది చేయాలన్నా భూమ్మీదే. పెరుగుతున్న పట్టణీకరణ ప్రభావంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో దళారులు అసైన్డ్ భూములనూ వదలడం లేదు. అమాయక రైతులను నయానో.. భయానో.. బెదిరించి వారి భూములను లాక్కుంటున్నారు. ఆ తర్వాత అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రభుత్వం నుంచి భూసేకరణ కోసం నోటిఫికేషన్ రాగానే పెద్దమొత్తంలో లబ్ది పొందుతున్నారు. ఐఐటీ హైదరాబాద్ సమీపంలోని ముంబయి హైవే పక్కన భూముల ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో ఆ ప్రాంతంలోని దళిత, గిరిజన, బీసీ పేదలకు చెందిన అసైన్డ్ భూములపై పెద్దల కన్ను పడింది. ఇండిస్టీయల్ పార్క్ కోసం భూముల్ని లాక్కుంటారని భయపెట్టి అమాయకులైన రైతుల నుంచి ముందే లాగేసుకున్నారు. తాజాగా జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆగమేఘాల మీద భూసేకరణకు పూనుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. జిల్లాలో రెండు జాతీయ రహదారులు హైదరాబాద్–ముంబయి, హైదరాబాద్–నాందేడ్‌లు విస్తరించి ఉన్నాయి. జాతీయ విద్యాసంస్థ ఐఐటీ హైదరాబాద్ కంది మండలంలోనే ఉంది. అనేక మల్టీనేషనల్ కంపెనీలు, స్థానిక పరిశ్రమలూ విస్తరించాయి. దాంతో జిల్లా కేంద్రం కంటే కంది మండల కేంద్రంలోని భూములకే అధిక ధరలు పలుకుతున్నాయి.అందుకే ఈ మండలంలో ఉన్న అసైన్డ్ భూములపై పెద్దల కన్ను పడింది. ఇప్పటికే అనేక గ్రామాల్లో అసైన్డ్ భూములు కబ్జా అయ్యాయి. తాజాగా చెర్యాల్ గ్రామంలోని దళితులు, గిరిజనులు, బీసీలకు చెందిన 120.16 ఎకరాల అసైన్డ్ భూముల్ని ప్రభుత్వ అవసరాల పేర లాక్కునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇండిస్టీయల్ పార్క్‌కు 120 ఎకరాల భూసేకరణ

చెర్యాల్ గ్రామంలోని 741, 741/1 సర్వే నెంబర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 120.16 ఎకరాల అసైన్డ్ భూముల్ని ఇండిస్టీయల్ పార్క్ కోసం సేకరించాలనే ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇండిస్టీయల్ పార్క్ కోసం ముందుగా గుమ్మడిదల మండలంలో 120 ఎకరాల అసైన్డ్ భూముల్ని సేకరించాలని చూశారు. దళితులకు చెందిన భూముల్ని పార్క్ కోసం తీసుకుంటున్నామని అధికారులు ప్రకటించడంతో బాధిత రైతులు పెద్దఎత్తున వ్యతిరేకించారు. దీంతో అక్కడ భూసేకరణను ఉపసంహరించుకుని.. కంది మండలంలోని చెర్యాల్ గ్రామంలో ఉన్న విలువైన అసైన్డ్ భూముల్లో ఇండిస్టీయల్ పార్క్ కోసం 120.16 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

ఆ భూమే పేదలకు జీవనాధారం

చెర్యాల్ గ్రామంలో భూమి లేని నిరుపేదలైన దళిత, గిరి జన, బీసీ కుటుంబాలు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములే జీవ నాధారంగా బతుకుతున్నాయి. చెర్యాల్ గ్రామంలోని 741 సర్వే నెంబర్‌లో 340 ఎకరాల వరకు ప్రభుత్వ, అసైన్డ్ భూములున్నాయి. 1965 నుంచి 1970 మధ్య కాలంలో అప్పటి ప్రభుత్వాలు గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాల్ని లబ్దిదారులుగా ఎంపి క చేశాయి. ఒక్కొక్కరికి ఎకరం, అరెకరం, రెండెకరాల చొప్పున వంద కుటుంబాలకు 120.16 ఎకరాల్ని అసైన్డ్ చేసి పట్టా సర్టిఫికెట్స్ జారీ చేశాయి. లబ్దిదారులకు భూములను పంపిణీ చేసి హక్కులు కల్పించారు. అప్పటి నుంచి ఆ భూముల్లో పంటలు పండించుకుంటూ కుటుంబాల్ని పోషించుకుంటున్నారు.

ఇండిస్టీయల్ పార్క్ పేర కాజేసే కుట్ర

ఇండిస్టీయల్ పార్క్ పేరిట విలువైన పేదల భూముల్ని కాజేయాలనే కుట్రలు సాగుతున్నాయి. ఇండిస్టీయల్ పార్క్ పెట్టేందుకు ఎక్కడో శివారు మండలాల్లో భూముల్ని సేకరించాలి. కానీ.. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరం, ఐఐటీ హైదరాబాద్ పక్కనే ఉన్న చెర్యాల్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూముల్నే ఎందుకు సేకరిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇండిస్టీయల్ పార్క్ పేరిట పేదల భూముల్ని సేకరిస్తారు. ఆ భూముల్ని తెలంగాణ రాష్ట్ర ఇండిస్టీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కి బదలాయిస్తారు. తర్వాత టీజీఐఐసీ ఆ భూముల్ని అభివృద్ధి చేసి కంపెనీలకు నామమాత్రపు ధరకు విక్రయిస్తుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ముఖ్యమైన నాయకుడికి భూముల్ని కట్టబెట్టేందుకే ఈ వ్యవహారాన్ని చక్కబెడుతున్నట్టు తెలుస్తోంది. 741 సర్వే నెంబర్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల భూముల్ని ఇండిస్టీయల్ పార్క్ కోసం ప్రభుత్వం లాక్కుంటుందనీ, ఏమీ ఇవ్వకుండా తీసుకుంటే నష్టపోతారని రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతులను భయపెట్టారు. కొందరు రైతులతో బేరసారాలాడి తక్కువ ధర ఇచ్చేట్టుగా ఒప్పందం చేసుకుని భూముల్ని తీసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడ ఎకరం ధర రూ.6–7 కోట్లు ఉంది. ప్రభుత్వం నుంచి రూ.60 లక్షల వరకు నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పి రైతుల్ని ఒప్పిస్తున్నారు.

పేదల అసైన్డ్ భూములే టార్గెట్

పరిశ్రమలు, అభివృద్ధి పేరిట ప్రభుత్వం.. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరిట రాజకీయ నాయకులు పేదల అసైన్డ్ భూముల్నే టార్గెట్ చేస్తున్నారు. గత ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లంటూ అసైన్డ్ భూముల్ని పైసా పరిహారమివ్వ కుండానే లాగేసుకుంది. ఈ ప్రభుత్వం వచ్చాక కూడా అదే జరుగుతోంది. న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మాడ్గి గ్రామాల్లో ఫార్మాసిటీ పేరిట 2 వేల ఎకరాల భూముల్ని సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో 600 ఎకరా లు అసైన్డ్ భూములే ఉన్నాయి. అక్కడి రైతులు వ్యతిరేకించ డంతో ఆగిపోయింది. గుమ్మడిదల మండలంలో ఇండిస్టీయల్ పార్క్ కోసం 120 ఎకరాల్ని సేకరించేందుకు భూముల్ని గుర్తించారు. అక్కడి రైతులు వ్యతిరేకించడంతో తాజాగా కంది మండలంలో రైతుల్ని ముందే ఒప్పించే పనిలో పడ్డారు.

బలవంతపు భూసేకరణ సరికాదు : ఎం.నర్సింహులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సంగారెడ్డి

చెర్యాల్ గ్రామంలో పేదల అసైన్డ్ భూముల్ని ఇండిస్టీయల్ పార్క్ కోసం బలవంతంగా సేకరించొద్దు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు భూములే జీవనాధారంగా బతుకుతున్నారు. కంది మండలంలో ఎకరం ధర రూ.ఐదారు కోట్లు ఉంది. భూములు తీసుకుంటే రైతులకు ఏం నష్టపరిహారం ఇస్తారో.. ఇతర బెనిఫిట్స్ ఏమిటో చెప్పకుండా మధ్యవర్తులు భూములు రాయించుకుంటున్నారు. 2013 భూ సేకరణ చట్టంలో ఉన్న సదుపాయాలన్నీ కల్పించాలి.

# పండగపూట విషాదం..మానేరులో మునిగి యువకుడు మృతి




మల్హర్ రావు: అమృత్ తెలంగాణ: ముస్లిం సోదరి, సోదరుల పర్వదినమైన బక్రీద్ పండుగ రోజున మండలంలోని కొయ్యూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సయ్యద్ ఉస్మాన్ (బైక్ మెకానిక్) (25) యువకుడు ప్రమాదవశాత్తు అడవిసోమన్ పల్లి మానేరులో మునిగి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల, కుటుంబ సభ్యుల పూర్తి కథనం ప్రకారం.. ఉస్మాన్ బక్రీద్ పండుగ వేడుకలకు హాజరై స్నేహితులతో అడవిసోమన్ పల్లి బ్రిడ్జివద్ద నున్న మానేరు నది ప్రక్కన దవాత్ చేసుకుందామని వెళ్లినట్లుగా తెలిపారు. వాగులో మల, మూత్ర విషర్జనకు వెళ్లి కాలు జారీ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లుగా తెలిపారు. ప్రమాదం సంఘటన స్థలాన్ని కొయ్యూర్ పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇసుక క్వారీ గుంతలే ప్రమాదానికి కారణమా.? మండలంలోని వళ్లెంకుంట(అడవిసోమన్ పల్లి), మల్లారం ఇసుక క్వారీ నిర్వాహకులు ఓసిపిలను తలిపించేలా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్డుఅదుపు లేకుండా భారీగా గుంతలు తీయడంతో రాబోయే వర్షాకాలంలో పశువులు, మత్సకారుల, పశువుల కాపర్లు, ప్రజలు ప్రమాదాలకు గురైయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉస్మాన్ ఇసుక కోసం క్వారీ నిర్వహకులు తీసిన గుంతలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్వారీలపై ఇప్పటికైనా టిఎండిసి అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


# హుస్నాబాద్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు ..



హుస్నాబాద్ :అమృత్ తెలంగాణ:బక్రీద్ పండుగ సందర్భంగా శనివారం హుస్నాబాద్ లోని ఈద్గాలో నమాజు నిర్వహించారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ త్యాగం, భక్తి ,విశ్వాసానికి, ప్రతీక, అని మొహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను సోదర భావాన్ని అందరూ అనుసరించాలని ఆకాంక్షిస్తూ ముస్లిం సోదరులందరికీ మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ బక్రీద్ పండుగశుభాకాంక్షలు తెలిపిపారు. ఆయనతోపాటునాయకులు వాలానవీన్ రావు,యండి బాషమియా, జామా జామా మజీద్ అధ్యక్షులు,యండి హసన్, ప్రధానకార్యదర్శి,యండి అన్వర్, ఆలంగిర్ మజీద్ అధ్యక్షులు,యండి ఆయూబ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు,యండి ఫసి యేద్దీన్,


యండి దస్తాగిర్,యండి షబ్బీర్, సయ్యద్ పాషా, తాజ్ పాషా, ముంతాజ్, ఖమాల్ సాబ్, సయ్యద్ ఇంతియజ్, రూహుల్అమీన్, జహంగీర్, అజీమ్,అఫ్జల్ పాషా, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# కవ్వించి రెచ్చగొడుతున్న ఖిలాడీ గాళ్



మాస్ మహారాజా రవితేజ సరసన ఖిలాడీ చిత్రంలో నటించింది మీనాక్షి చౌదరి. తనదైన అందం నటనతో యువతరాన్ని మురిపించిన ఈ బ్యూటీ సోషల్ మీడియాల్లోను అంతే స్పీడ్ గా ఉంది. నిరంతరం ఈ అందాల భామ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తోంది. తాజాగా మరో హాట్ ఫోటోషూట్ మీనాక్షి సోషల్ మీడియాల్లో ప్రత్యక్షమైంది. మీనాక్షి ఈ ఫోటోగ్రాఫ్స్ లో టూ హాట్ గా కనిపిస్తోందంటూ బోయ్స్ కామెంట్లు చేస్తున్నారు. ఆమె అందానికి చలి జ్వరం ఖాయం! అంటూ ఫిదా అయిపోతున్నారు. మీనాక్షి తదుపరి హిట్ లో నటిస్తోంది. అలాగే కొలై అనే సినిమాలోను కథానాయికగా కనిపించనుంది. ఈ రెండు సినిమాల్లోను గ్లామర్ ఆవిష్కరణతో పాటు నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో నటిస్తోందని సమాచారం. ప్రస్తుతం టాలీవుడ్ లో వరుస చిత్రాలకు సంతకాలు చేస్తోంది. ఇరుగు పొరుగు భాషల్లోను లక్ చెక్ చేసుకుంటోంది. ఇక స్కిన్ షోకి ఏమాత్రం అభ్యంతరం చెప్పని మీనాక్షి ఫోటోషూట్లలోను అస్సలు తగ్గడం లేదు. పెద్ద తెరపై పెదవి ముద్దులకు అభ్యంతరం చెప్పనని స్టేట్ మెంట్ ఇచ్చిన ఈ భామకు అవకాశాలిచ్చేందుకు మన దర్శకహీరోలకు ఆసక్తి పెరిగింది. డార్లింగ్ ప్రభాస్ సరసన సలార్ లో నటించే అవకాశం ఉందని కథనాలొచ్చినా ఎందుకనో ఆ ఛాన్స్ మిస్సయ్యింది. కానీ భవిష్యత్ లో అగ్ర నాయికగా ఎదిగేందుకు అవసరమైన అన్ని క్వాలిటీస్ ఈ అమ్మడిలో దండీగా ఉన్నాయని ట్రేడ్ విశ్లేషిస్తోంది. మోడల్ కం నటి మీనాక్షి అందాల పోటీ టైటిల్ హోల్డర్. ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీలో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. అక్కడ ఆమె మిస్ గ్రాండ్ ఇండియాగా కిరీటాన్ని పొందింది. చౌదరి మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. 1వ రన్నరప్ గా కిరీటాన్ని పొందింది. 2021లో తెలుగు చిత్రం ఇచ్చట వాహనములు నిలుపరాదు తో తెరంగేట్రం చేసింది. మొదటి సినిమాతోనే ఆకట్టుకున్న ఈ బ్యూటీకి అవకాశాల పరంగా కొదవేమీ లేదు. అయితే సెలక్టివ్ గా కెరీర్ ని ముందుకు నడిపిస్తోంది.

# చిరు-ఓదెల ప్రాజెక్ట్.. నాని కామెంట్స్ విన్నారా?



దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నేచురల్ స్టార్ నిర్మాతగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నేచురల్ స్టార్ నిర్మాతగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఇంకా సెట్స్ పైకి వెళ్లని ఆ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అనౌన్స్మెంట్ తోనే చిరు- ఓదెల- నాని ప్రాజెక్ట్ పై ఫ్యాన్స్, ఆడియన్స్ వేరే లెవెల్ లో అంతా హోప్స్ పెట్టుకున్నారనే చెప్పాలి. అయితే ఆ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. సినిమా ఎలా ఉండనుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మూవీ అప్డేట్స్ రావడం లేటు.. సోషల్ మీడియాలో అంతా వైరల్ చేస్తున్నారు. తాజాగా నాని.. తన అప్ కమింగ్ మూవీ హిట్–3 ప్రమోషన్స్ లో ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. విజయ్ దేవరకొండ ప్యారడైజ్ మూవీ తర్వాత చిరంజీవి ప్రాజెక్ట్ పనులు స్టార్ట్ అవుతాయని నాని తెలిపారు. ప్యారడైజ్ మూవీ షూటింగ్ మరికొద్ది రోజుల్లో మొదలవుతుందని చెప్పారు. మెగాస్టార్ సినిమాను 2027లో విడుదల చేస్తామని వెల్లడించారు. సినిమాకు సంబంధించిన అన్ని అప్డేట్స్ మరికొద్ది రోజుల్లో ఇస్తామని నేచురల్ స్టార్ పేర్కొన్నారు. సినిమా షూటింగ్ స్టార్ట్ అయ్యాక.. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు, టైటిల్ వంటి మరిన్ని అప్డేట్స్ ను తప్పకుండా ఇస్తామని అన్నారు. అదే సమయంలో తాను చిన్నప్పటి నుంచి సత్యం థియేటర్ వద్ద చిరంజీవి సినిమా పోస్టర్స్ పెరిగానని చెప్పారు. ఆయనంటే తనకు మాటల్లో చెప్పలేని అభిమానముందని వెల్లడించారు. అదే సమయంలో ఇప్పుడు మెగాస్టార్ సినిమాకు నిర్మాతకు వ్యవహరిస్తుంటే.. ఒక బయోపిక్ తీస్తున్న ఫీలింగ్ కలుగుతుందని నాని అన్నారు. ఎప్పుడూ ఆ మూవీ కోసమే ఆలోచిస్తున్నానంటూ చెప్పారు. ఫ్యాన్ బాయ్ మూమెంట్ కోసం ఈగర్లీ వెయిటింగ్ అని తెలిపారు. దీంతో నాని కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. అయితే చిరంజీవి–శ్రీకాంత్ మూవీ స్టార్ట్ కావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది. వచ్చే ఏడాది షూటింగ్ మొదలు కావచ్చు. కానీ నాని మాత్రం ఆ ప్రాజెక్ట్ పై ఫుల్ ఫోకస్ పెట్టినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఎంతైనా ఫ్యాన్ కదా అందుకేనేమో. మరి ఆ సినిమా ఎప్పుడు మొదలవుతుందో.. ఎప్పుడు వస్తుందో.. ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# అనుపమని పట్టించుకోరేంటి..? అదేంటి ఎందుకలా అంటే..



కెరీర్ మొదట్లోనే కుర్రాళ్ల హృదయాలను దోచేసిన ఈ ముద్దుగుమ్మ బొద్దుగా ఉంటే ఛాన్స్ లు రావట్లేదని సన్నగా మారింది అందాల అనుపమని టాలీవుడ్ లో పట్టించుకునే వారు కరువయ్యారు. అదేంటి ఎందుకలా అంటే.. కెరీర్ మొదట్లోనే కుర్రాళ్ల హృదయాలను దోచేసిన ఈ ముద్దుగుమ్మ బొద్దుగా ఉంటే ఛాన్స్ లు రావట్లేదని సన్నగా మారింది. అనుపమలోని ఈ మేకోవర్స్ కొంతమంది ఫ్యాన్స్ కి నచ్చినా కొంతమందికి మాత్రం రుచించలేదు. అయినా సరే ఒకసారి ఇష్టపడ్డాక తప్పదు కదా అనుకుంటూ ఆమెని అభిమానిస్తూ వచ్చారు. అదేంటో అందం అభినయం రెండు ఉన్నా కూడా అంపమకి లక్ కలిసి రాలేదు. తెలుగులో సినిమాలు చేసినా కూడా స్టార్ స్టేటస్ అందుకోలేదు. కెరీర్ లో సినిమాలు పడుతున్నా కొద్దీ స్టార్ హీరోలతో నటించే ఛాన్స్ అందుకోవాలి. కానీ అమ్మడి గ్రాఫ్ పడిపోతూ యువ హీరోలతో నటించే పరిస్థితి వచ్చింది. అఫ్కోర్స్ ఆ సినిమాలు కూడా పాపులారిటీ తెచ్చే ఛాన్స్ ఉంటుంది. కానీ అనుపమ మాత్రం ఆశించిన స్థాయిలో క్రేజ్ తెచ్చుకోలేదు. లాస్ట్ ఇయర్ తెలుగులో ఈగల్, టిల్లు స్క్వేర్ సినిమాలు చేసింది అమ్మడు. టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ పడినా కూడా అమ్మడికి తర్వాత పెద్దగా ఛాన్స్ లు రాలేదు. ప్రస్తుతం అమ్మడు పరదా సినిమా చేస్తుంది. ఆ సినిమా టీజర్ తో ఆడియన్స్ లో ఆసక్తి కలిగేలా చేశారు. ఇక మరోపక్క కోలీవుడ్ స్టార్ చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ తో బిసన్ అనే సినిమా చేస్తుంది అమ్మడు. లాక్ డౌన్ అనే సినిమా కూడా చేస్తుంది అనుపమ. మలయాళంలో కూడా పెట్ డిటెక్టివ్ సినిమా చేస్తుంది అనుపమ. దానితో పాటు జె.ఎస్.కె ట్రూత్ షల్ ఆల్వేస్ అనే సినిమా చేస్తుంది. తమిళ, మళయాళ భాషల్లో పర్వాలేదు కానీ తెలుగులో మాత్రం అనుపమని పట్టించుకోవట్లేదు. రీసెంట్ గా డ్రాగన్ సినిమాతో తమిళంతో పాటు తెలుగులో కూడా సక్సెస్ అందుకుంది అనుపమ పరమేశ్వరన్. ఐతే టాలీవుడ్ లో అమ్మడికి ఛాన్స్ లు రాకపోవడానికి కారణం ఏంటన్నది తెలియట్లేదు. ఏది ఏమైనా అనుపమ విషయంలో తెలుగు మేకర్స్ ఏం ఆలోచిస్తున్నారు




# దిశ స్టైలిష్ లుక్ ఎలివేషన్ సో హాట్!



దిశా పటానీ టెంప్టింగ్ ఫోజుల గురించి చెప్పాల్సిన పనిలేదు. యువతలో నిత్యం అమ్మడి హాట్ ఫోజులు హాట్ టాపిక్. డిజైనర్ సహా అల్ట్రా మోడ్రన్ బ్యూటీగానూ అమ్మడు అగ్గి రాజేస్తుంది. ఇటీవలే మిర్రర్ సెల్ఫీలో బ్యూటీ ఓ రేంజ్ లో సెగలు పుట్టించింది. తాజాగా అమ్మడి న్యూ లుక్ ఒకటి నెట్టంట కుర్రాళ్లలో గుబులు రేపుతుంది. స్టైలిష్ బ్రాండెడ్ జీన్స్ పై బ్లాక్ కలర్ స్కిన్ టైట్ వేర్ లో అగ్గిరాస్తుంది. చినుగుల జీన్స్ చుట్టూ గోల్డ్ కలర్ చైన్ న్యూవేర్ ని మరింత ఫోకస్డ్ గా ఎలివేట్ చేస్తోంది. అమ్మడి స్కిన్ టోన్ ని టాప్ మరింత ఆకర్షణీయంగా మలిచింది. అమ్మడి క్లీవేజ్ అందాలు.. ఆ నడుం ఒంపు సొంపులు కుర్రాళ్లకి కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండు చేతులు పైకెత్తి..ఆ నడుముని కాస్త 45 డిగ్రీలు బెండు చేసిన ఫోజు వావ్ అనిపించలే. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. దిశ అభిమానులు ఆ అందాన్నితనవి తీరా చూసి ఆస్వాదిస్తున్నారు. ఇక కామెంట్ల వర్షానికైతే కొదవలేదు. ఎవరి స్టైల్లో వారు చెలరేగుతున్నారు. ఇక అమ్మడి కెరీర్ విషయానికి వస్తే 'లోఫర్' తర్వాత బాలీవుడ్ లో బిజీ అయిన సంగతి తెలిసిందే. హిందీలో బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లు అందుకుని దూసుకుపోతుంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com